"జటా కటా హ. . . ధగద్ధ గల్లలాట పట్ట పావకే. . ."

రావణ విరచిత శివస్తోత్రం శ్రీశైల సానువుల్లో తిరుగుతూ ఆనందం పట్టలేక పైకే అన్నాను. నా ఎదురుగా ఒక యువతి దీనంగా మాసిన పట్టు చీరలా నిలబడి ఉంది. ఎవరమ్మా మీరు అని అడిగాను.

"ప్రస్తుతం చాపసానిని. అర్థం కావేదా అమ్మా! ఇక్కడికి వచ్చే యాత్రికులకు చౌక ఖరీదు పావలా, నా ఖరీదు పావలాగా నన్ను నేను అమ్ముకుంటున్న చాపసానిని. ప్రస్తుతం అదే నా పేరు" అంది ఆ యువతి, నిండా మునిగాక చలేమిటన్నట్లు. ఇంత వరకూ అలాటి పేరు నేను వినలేదు. ప్రాచీనమైన వ్యభిచారానికి సుంకం ఉండాలని కౌటిల్యుడు అన్నాడు. కాని అదే దేశంలో 'స్త్రీ' ఖరీదు ఇంత స్వల్పం ఎందుకయింది? బోగసానిని చాప సానిని ఎవరు చేశారు?

"అలా ఎందుకయింది?" అన్నాను. ఆమె చెప్పటం సాగించింది.

"మల్లమ్మసాని మహా నర్తకి. ఆమె శివభక్తురాలు. ఆ రోజున ఆమె కుంభహారతి పడుతూంది. స్వామి భ్రమరాంబాదేవిని మరిచిపోయి మల్లమ్మ అందాన్నే చూస్తున్నాడు. ఆయన మూడు కన్నుల నుంచీ అమృతధారలు కురుస్తున్నాయి. ఆమె శివుడిని తప్ప చీమనికూడ కన్నెత్తి చూడని శివయోగిని. ఆ రోజున శివరాత్రి. ఆంధ్రదేశంలో. ప్రముఖు లందరూ ఆ ప్రాంగణం లోనే ఉన్నారు. ఆమె మాత్రం తన శివుడిని తప్ప మరెవర్ని కన్నెత్తి చూడటం లేదు. తను గజ్జె కట్టినప్పుడూ, పిండి బోసి తనని స్వామి కర్పితంగా గదిలోకి పంపినప్పుడూ తను కన్నెరికం ఆయనకే అర్పించింది. దానికి గుర్తుగా తన గది ముందుపోసిన పిండిలో స్వామి కాలిముద్రలు పడ్డాయని తన కులపు సానులు తనని చాలా గౌరవంగా చూశారు. ఆ కారణం వల్ల ఆమె శివయోగిని.

రావణుని రచిత శివస్తోత్రం అభినయిస్తున్న మల్లమ్మ వంక మహాకవి క్షేత్రయ్య ఆరాధనగా చూస్తున్నాడు. ఆయన అసలు పేరు వరదయ్య అయినా అనేక క్షేత్రాలు తిరగటం వలన క్షేత్రయ్య అనే పేరే ఆయనకు స్థిర పడి పోయింది.

అప్పటికే మువ్వగోపాల పదకర్తగా ఆయన కీర్తి దిగంతరాల దాకా వ్యాపించింది. మల్లమ్మ కీర్తి కూడా తక్కువేమీలేదు. ఆమె కిప్పుడు పాతిక సంవత్సరాలు. ఎవరయినా దౌర్భాగ్యులుఆమెని కొంటెగా చూస్తే— నాకు కన్నెరికం పెట్టింది మల్లికార్జున దేవుడు అనేది. ఎందఱు ఎక్కిరించినా ఆమె సమాధానం ఇదే. చూడగలిగిన కనులుంటే రాయి మనిషవుతుంది. మీ రందరూ మనుషులే కాని రాళ్ళు. నేను మల్లన్న ప్రేయసిని. నా శివుడిని పొగడాలంటే నేను కవిని కాను. నా కళ్ళకి నోరు లేదు. నోటికి కళ్ళు లేవు. నా తనువూ మనసూ శివార్పితం" అనే మల్లమ్మ మాటలు విని చూడటానికి వచ్చాడు క్షేత్రయ్య ఈమె మనసు శివార్పితం తన మనసు కృష్ణార్పణం. అయినా శివుడికీ, మాధవుడికీ భేదం ఏమిటి?

ఈ వూహ రాగానే ఆయన కవితా గంగాలహరి శివపరంగా ప్రవహించి రాసాగింది. క్షేత్రయ్య మువ్వ గోపాల పదకర్తగా నేటికీ లోకంలో తెలుసు గాని, శివపదకర్త అని చాలా మందికి తెలియదు. విరహిణీ వినయినీ అయిన మల్లమ్మ నాట్యం జరుగుతూ ఉంది. క్షేత్రయ్య అనువుగా శివపదం ఆలాపిస్తూనే ఉన్నాడు. భ్రమరాంబాదేవి భయం భయంగా గ్రీవాభంగారామంగా మల్లమ్మ వంక చూస్తూంది. దేవి భయం నిజమయింది. మల్లమ్మ నాట్యం ముగించి నిలబడి ముకుళిత హస్తంలో తన ప్రాణ పుష్పాన్ని ప్రభువు పాదాల చెంత ఉంచింది. క్షేత్రయ్య రుద్ధకంఠంతో సోదరీ అని ఆమె దగ్గరకు వెళ్ళాడు.

మల్లమ్మ నిలబడే ఉంది. కాని ప్రాణం లేదు. ఆ రోజుల్లో కూడా దేవాలయం మైల పడిందని ఎవరూ అనలేదు. మల్లమ్మ భౌతిక దేహాన్ని కులపు




## చరిత్ర కందని చిత్ర కథ

సానులు భూస్థాపితం చేయించారు. అంతసేపూ క్షేత్రయ్య శివపదాలు ఆలాపిస్తున్నాడు.

"ఆ మల్లమ్మ చెల్లెలి వంశంలో దాన్ని నేను" అన్నది ఆ యువతి. ఆ కథ నా అంత రాంతరాల్లో నీవారశూకంలా వెలుగుతున్న జ్యోతిని భగ్నమనిపించింది. ప్రభుత్వం వ్యభిచార నిరోధం పెట్టి మహా భక్తురాలైన దేవదాసీ కులాన్నీ, వారి నాట్యాన్ని నాశనం చేసిందా? అనే సందేహం కలిగింది. చాణుక్యుడి కంటే మన మంత్రులు గొప్పవాళ్ళు కారు. కాని వ్యభిచారం పెరిగిందే కాని కరగ లేదు నేడు. తెలిసీ అడిగాను.

"నీ వెందు కిట్లా అయినావు?" అని.

"ఆత్మహత్య మహాపాపం అని ఈ విధంగా బ్రతుకుతున్నాను తల్లీ! ప్రభుత్వం మమ్మల్నందరినీ నీచులుగాతలచి నిషేధించింది. నేను నృత్యంచేయుగలను: కాని బోగం దానిని. నీ కింత కావరమా? అని నన్ను ఎవరూ గౌరవించటం లేదు. గౌరవించక పోతే పోనీండి. అవమానించి. ఆ వ్యభిచారం లోనే అతి నీచాతినీచమైన చాపసానిగా దిగజార్చారు. నాకూ మా ముత్తవ్వ మల్లమ్మ లాగా స్వామిలో లీన మవ్వాలని ఉంది. అందుకే శ్రీశైలం దాటను. అదీగాక దాటి ఏం చెయ్యాలి? ఇదే పని కయితే అది ఇక్కడే చేయ వచ్చును. స్వామి పతిత పావనుడు. నా లాటి పతితలకి పతి. ఆయన దృష్టిలో కైలాసగిరి న్యాయ పీఠం మీద నా కన్యాయం జరగదు."

"ఇది అన్యాయం కాదా?" ఆలోచిస్తూనే అడిగాను.

"అమ్మా! అది మీ దృష్టిలో! బతకటానికి నాకు ఇది చాలు. శివభక్తుల్ని ఆనందింప చేస్తున్నాను. అది పుణ్యం కాదా? చావులోనా తల్లీ! శివు డెక్కడ లేడు-నే నెక్కడ ప్రాణం వదిలితే అక్కడే ఉంటాడు. తరతరానికీ దిగజారే మన సాంప్రదాయానికీ తెలిసి తక్కువకూ మనకూ ఆయనే రక్ష" అంది ఆమె. నాలో ఆశ్చర్యం పెరిగింది.

"ఎంతవరకు చదువుకున్నారు?" అని అడిగాను.

"శ్రీశైలస్వామి జీవితాన్ని నేర్పితే ఆయన పూజారి సంస్కృతం నేర్పారు. కులపుసానులు గుడి విడిచి వెళ్ళారు. చివరికి నేను మిగిలాను" అంది ఆమె.

అవును ఆమె మిగిలింది. శిథిలమైన శిల్పంలా ఆమె మిగిలింది. మల్లమ్మ వంశీకురాలు చాపసానిగా మిగిలింది. మన అస్తవ్యస్తపు ఆలోచనల్లాగా ఆమె మిగిలింది.

- డాక్టర్ లత